
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 31 మార్చి 2025





ఉగాది సందర్భంగా ప్రత్యేక అలంకరణలో నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారు

సంప్రదాయబద్ధంగా ఉగాది

- పలు ఆలయాల్లో వైభవంగా వేడుకలు
- గ్రామదేవతలకు ఉత్సవాలు
- పలుచోట్ల పంచాంగ పఠనం
- కోవెలలన్నీ కిటకిట
- శరవేగంగా జిల్లా అభివృద్ధి : కలెక్టర్



నగర గ్రామదేవత ఇరుగాళమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సూర్యోదయానికి ముందే కాలకృతులు తీర్చుకుని, సంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ ఇష్టదైవాలకు పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. కొత్త ఏడాదిలో తమకు భవిష్యత్ ఎలా ఉం టుందోనని తెలుసుకునేందుకు పలువురు టీవీ చానళ్ల ముందు కూర్చుండి పోయారు. అత్యధికులు ఆలయాల్లో జరిగే పంచాంగ పఠనాన్ని శ్రద్ధగా విన్నారు.ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో వాహనసేవలు జరిగాయి.

● పురస్కారాల ప్రదానం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఆలయంలోనూ వేద పండితులు, అర్చకులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. జేసీ కే. కార్తీక్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ-రమాదేవి దంపతులు, నగరంలోని రంగనాథస్వామి, చాకలివీధి మహాలక్ష్మి ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ట్రంకు రోడ్డులోని శివాజీసెంటర్ లో నిర్వహించిన సింహపురి ఉగాది వేడుకల్లో విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి పాల్గొని భక్తులకు మంగళశాసనాలు అందించారు.

● ఇరుగాళమ్మకు సారె

ఉగాది సందర్భంగా రంగనాథస్వామి ఆలయానికి వేదగిరి నుంచి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి తరలివచ్చి భక్తులకు దర్శనం ఇచ్చారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో అర్చకులు ఇరుకళల పరమేశ్వరికి ఉగాది సారె అందజేశారు.

● శరవేగంగా జిల్లా అభివృద్ధి : కలెక్టర్

జిల్లాలో ఈ ఏడాది సమృద్ధిగా పంటలు పండాయని, పరిశ్రమల స్థాపనతో శరవేగంగా జిల్లా అభివృద్ధి చెందు తున్నదని కలెక్టరు ఓ ఆనంద్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో జరి గిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. తెలుగుదనం ఉట్టి పడేలా సంప్రదాయ దుస్తులు ధరించి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలూరి శిరోమణిశర్మ పం చాంగ శ్రవణం చేశారు.



పంచాంగ పఠనం చేస్తున్న ఆలూరి శిరోమణిశర్మ

● ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఈ సందర్భంగా 11 మంది కవులతో సమ్మేళనం నిర్వహించారు. కవులు జీ.సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్ బాబు, పెంచలనరసింహం, నరసింహమూర్తి, సుధీర్‌కుమార్, రత్నప్రసాద్, పాతూరు అన్నపూర్ణ, లక్ష్మీ మైథిలి, నరేంద్రబాబు, తోట సులోచన, అలెగ్జాండర్ తమ కవితలను గానం చేసి, కలెక్టర్ నుంచి సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఏపీఎంఐసీ పీడీ శ్రీనివాసులు దుర్యోధన ఏకపాత్రాభినయం చేశారు. అనంతరం వివిధ రంగాల ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందచేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో భద్రాచలం బాబు, ఎం.జమున, వెంకటరమణయ్య, శివయ్య, శ్యామలాదేవి, విశ్వనాథం, శ్రీనివాసకుమార్, రసూల్, ఉషాకిరణ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో అతిథులుగా నగర మేయర్ స్రవంతి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కే. జనార్దన్‌రెడ్డి, డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీవో అనూష, ఐ.పీఆర్ డీడీ సదారావు, జిల్లా టూరిజం అధికారి శివ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం నుంచి పురస్కారాలు

వెంకటాచలం మండలం సరస్వతీ నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడ భూషి సంపత్‌కుమార్ సాహిత్య రంగంలో అందించ సేవలకుగానూ అమరా వతిలో జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చం ద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకు న్నారు. అలాగే ప్రముఖ రచయిత, కవి ఈతకోత సుబ్బారావు, టీవీ, నాట కరంగ హాస్య నటుడు దోర్నాల హరిబాబు కూడా సీఎం నుంచి పురస్కారం అందు కున్నారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న మాడభూషి సంపత్‌కుమార్





ఉగాది పురస్కారం అందుకుంటున్న ఈతకోట సుబ్బారావు

కళారత్న అవార్డు అందుకుంటున్న దోర్నాల హరిబాబు



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులతో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్



నేడు రంజాన్

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం(నేడు) రంజాన్ వేడుకలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లింలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ నెల ప్రారంభం నుంచి ఆదివారం (ఈనెల 30) వరకు ఉపవాస దీక్షలను ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి చేసిన సందర్భంగా అల్లాహ్‌కి కృతజ్ఞతలు తెలిపే పండుగ రంజాన్. దీన్ని ఈదుల్ ఫితర్‌గా పిలుస్తారు. సోమవారం జిల్లాలోని 444 మసీదులు, ఈద్గాలలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు రంజాన్ ప్రార్థనలు జరుగుతాయి. దీంతో నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. కాగా నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద రంజాన్ ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే నవాబుపేట, బుజబుజనెల్లూరు, జాకీర్‌హుస్సేన్ నగర్, బర్మాసెల్ గుంట, తూకుమానుమిట్ట తదితర ప్రాంతాల్లోని ఈద్గాలలో కూడా నగర పాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. రంజాన్ సందర్భంగా అల్లాహ్ దయతో జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలని పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు అందజేశారు.



నెలవంక కనబడటంతో బాణాసంచా కాల్చి నగరంలో సంబరాలు చేసుకుంటున్న ముస్లింలు

- మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు



రంజాన్ సందర్భంగా ముస్తాబైన నెల్లూరు బారా షహీద్ దర్గా ప్రాంగణం

ఏఎంసీలపై ఆశలు

- ఊపందుకున్న ఆశావహుల ప్రయత్నాలు
- అధిష్ఠానానికి వినతుల వెల్లువ
- భాగస్వామ్య పార్టీలకు పదిశాతం పదవులు
- ఈ క్రమంలో ఏ కమిటీకి ఎవరన్నది చర్చనీయాంశం

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నామినేటెడ్ పదవుల్లో కీలకమైన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ)ల ఛైర్మన్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు ఊపందుకున్నాయి. తొలుతగా సర్వేపల్లి ఏఎంసీ ఛైర్మన్‌ను నియమించడంతో జిల్లాలో మిగతా కమిటీల పదవుల కోసం నేతల ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. వీటి భర్తీ కోసం ఎమ్మెల్యేలపై స్థానిక నాయకుల ఒత్తిడి మొదలయ్యింది. దీంతో తమ నియోజకవర్గాల పరిధిలోని ఏఎంసీ పదవులను భర్తీ చేయాలని అధిష్ఠానికి విన్నవించుకుంటున్నారు. ముఖ్యమైన కమిటీలకు సంబంధించి ఇప్పటికే పలుచోట్ల ఎమ్మెల్యేలు ఓ నిర్ణయానికి వచ్చేశారు. అయితే సొంతపార్టీలోనే పలువురు ఈ పదవుల కోసం పోటీ పడుతున్న కారణంగా ఎటూ తేల్చలేక కొందరు మౌనంగా ఉండగా, మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనలకు ఏ మార్కెటింగ్ కమిటీలు ఖరారు చేస్తారో తెలియని కారణంగా, తమ నియోజకవర్గాల పరిధిలోని మార్కెటింగ్ కమిటీల్లో తమ పార్టీకి ఏవి మిగులుతాయో తేలాక తుది నిర్ణయం తీసుకోవాలని ఎదురుచూస్తున్నారు.

సేన, బీజేపీలకు పది శాతం !?

మిత్రపక్షాల ఒప్పందం నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో సైతం జనసేన, బీజేపీలకు కొన్ని సీట్లు కేటాయించాలని కూటమి పెద్దలు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సాగునీటి సంఘ ఎన్నికల్లో సైతం జనసే,బీజేపీలకు పది శాతం సంఘాలను కేటాయించారు. ఇప్పుడు మార్కెటింగ్ కమిటీల్లో సైతం ఇదే నిష్పత్తిలో ఆ పార్టీలకు పది శాతం మార్కెటింగ్ కమిటీలు కేటా యించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన మార్కె టింగ్ కమిటీలను తమకు కేటాయించాలని జనసేన, బీజేపీ నాయకులు కోరే అవకాశం లేకపోలేదు. తొలుత కూటమికి చెందిన జిల్లా పెద్దలు కూర్చొని ఏ మార్కెటింగ్ కమిటీ ఏ పార్టీకి అనే విషయం ఖరారు చేసే వరకు ఆ కమిటీలకు ఛైర్మన్లు ఎవరనే విషయంలో స్పష్టత కనిపించదు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

నామినేటెడ్ పదవుల్లో కీలకమైనవిగా గుర్తింపు పొందిన ఏఎంసీలపై పలువురు నాయకులు ఎన్నికల ముందు నుంచే కన్నేసి ఉన్నారు. ఆ పోస్టు ఇస్తే పార్టీలో చేరుతామని కొందరు, ఇస్తారనే నమ్మకంతో కష్టించిన వారు ఇంకొందరు ఇలా టీడీపీలో ఓ స్థాయి కలిగిన ప్రతి నాయకుడు మార్కెట్ కమిటీపై ఆశలు పెట్టుకున్నారు.

- ఆత్మకూరు మార్కెటింగ్ సొసైటీకి ఆనం సంజీవరెడ్డి తనయుడు ఆనం మురళీరెడ్డి పేరు ప్రచారంలో ఉంది. కావలి మార్కెటింగ్ కమిటీ పమిడి రవికుమార్ చౌదరి పేరు బలంగా వినిపిస్తోంది. ఇతనికి ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ కమిటీ బీసీ మహిళకు రిజర్వు చేశారు. రిజర్వేషన్లు మార్పు చేయడానికి ప్రయత్నిస్తారా లేక పార్టీలోనే బీసీ మహిళలను ఎంచుకుంటారో అంతుపట్టకుండా ఉంది.
- కందుకూరు ఏఎంసీ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. ఈ సామాజికవర్గం నుంచి రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణం, పులి నాగరాజు, చిడితోటి బాలకోటయ్యల సతీమణుల పేర్లు అధిష్ఠానానికి పంపినట్లు సమాచారం. అయితే పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఈ పదవి కోసం గట్టిగా పట్టుపడుతున్నట్లు సమాచారం. రిజర్వేషన్ మార్పు చేయించి ఈ పదవి తనకు ఇప్పించాలని అతను ఎమ్మెల్యేపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- ఉదయగిరి ఏఎంసీ ఓసీ మహిళకు రిజర్వు అయ్యింది. వింజమూరుకి చెందిన గణపం సుదర్శన్‌రెడ్డి సతీమణికి దాదాపుగా ఈ పదవి ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది.

ఇలా జిల్లా పరిధిలోని చిన్నాపెద్ద తేడా లేకుండా అన్ని ఏఎంసీలకు ఆశావహులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సర్వేపల్లి ఏఎంసీ నియామకం జరగడంతో ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏఎంసీల కమిటీల కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. పల్లెలు,పట్టణాలు తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఏఎంసీ ఛైర్మన్లు ఎవరు..? ఏ ఏఎంసీ ఏ పార్టీకి అనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. మరోవైపు ఈ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి.

రేపటి నుంచి
కళాశాలల పునః ప్రారంభం

- ఇంటర్‌లో మారిన సిలబస్ ● నమూనా ప్రశ్నపత్రం విడుదల
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా మార్పులు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ఈ ఏడాది నుంచి అమలుకు శ్రీకారం చుట్టింది. నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు 2025-26 విద్యాసంవత్సరానికి చెందిన సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు, అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 1 (రేపటి) నుంచి తరగతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక 314 రోజులకుగాను 235 పనిదినాలు, 79 సెలవులను కూడా ప్రకటించింది.

● షెడ్యూల్ ఇలా...

జూనియర్ కళాశాలలు ఇప్పటి వరకు ప్రతి ఏటా జూన్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తుండగా, ఈ విద్యాసంవ త్సరం మాత్రం ఏప్రిల్ ఒకటి (మంగళవారం) నుంచే ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 2న కళాశాలలు ప్రారంభించి జూలై 17 నుంచి 19 వరకు యూనిట్-1 పరీక్షలు నిర్వహిం చనున్నారు. ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2 పరీక్షలు, సెప్టెం బరు 15 నుంచి వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. అలాగే సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5వరకు దసరా సెలవులు, అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకు అర్థ సంవత్సరం పరీక్షలు, జనవరి 15 నుంచి 20వరకు ప్రీఫైనల్-1 పరీక్షలుంటాయి. ఇకపోతే 2026 జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు, జనవరి 21 నుంచి 28 వరకు ప్రీఫైనల్-2, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి చివరివారం నుంచి మార్చిలో థియరీ పరీక్షలు నిర్వహించి మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించేలా షెడ్యూల్ ప్రకటించారు.

● అమల్లోకి కొత్త సిలబస్

2012-13లో రూపొందించిన ప్రథమ సంవత్సరం సైన్స్, 2014-15లో ఆర్ట్స్, 2018-19లో లాంగ్వేజ్ సిలబస్‌ను ఈ ఏడాది నుంచి మార్పు చేశారు. 2025-26లో ప్రథమ సంవత్సరానికి కొత్త సిలబస్‌ను రూపొందించారు. ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను వచ్చే ఏడాది నుంచి మార్చనున్నారు. ప్రథమ, ద్వితీయభాషలతో పాటు ప్రస్తుతం ఉన్న నాలుగు సబ్జెక్టుల సైన్స్, ఐదు సబ్జెక్టుల ఆర్ట్స్ విభాగాలను ప్రక్షాళన చేశారు. అలాగే ప్రథమభాషగా ఇంగ్లిష్‌ను అందరికీ వర్తింపచేస్తుండగా, ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్ ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్టులను ప్రతిపాదించి, ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థికి కల్పించారు. అలాగే గ్రూపు సబ్జెక్టుల విషయానికి వస్తే ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా ఎంబైపీసీ చదువుకుని జేఈఈ, నీట్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది.

● ప్రశ్నపత్రాల్లోనూ మార్పు

ఈ ఏడాది నుంచి ప్రశ్నపత్రాల కూర్పులోనూ మార్పులు చేశారు. మ్యాథ్స్-ఏ, బీలుగా ఉన్న రెండు పేపర్లను కలిపి ఒకే పేపర్‌గా, బోటనీ, జువాలజీలను కలిపి బయాలజీ పేపర్‌గా మార్చారు. వీటితోపాటు అదనపు సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెడుతుం డడంతో ఆయా సబ్జెక్టులలోని మార్కులను పునర్విభజన చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2, 4, 8 మార్కుల విధానాన్ని కొనసాగిస్తూనే ప్రతి సబ్జెక్టులో దాదాపు 10శాతం ఒక్కమార్కుల ప్రశ్నలు ఉండేలా ప్రశ్నపత్రాన్ని రూపొందించనున్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు మధ్యనున్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. అలాగే గతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న ఏడు పీరియడ్ల విధానానికి స్వస్తి పలికారు. ఇక నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 8 పీరియడ్లు ఉండేలా మార్పు చేశారు.

ఇంటర్ విద్యలో సంస్కరణలు



సంస్కరణలకు అనుగుణంగా ఇంటర్ కళాశాలలు నిర్వహించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. 2020 జాతీయ విద్యావిధానం, 2023 జాతీయ పాఠ్య ప్రణాళికా చట్టాలను అనుసంధానం చేస్తూ ప్రజా స్పందనలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కోరుకున్న సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడం, అనవసర విషయాలను తగ్గించుకోవడం, విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఇంటర్ కళాశాలలు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి. - డాక్టర్ ఏ.శ్రీనివాసులు, ఆర్ఐవో

ఇక సాఫీగా ప్రయాణం !

- ఉమ్మడి జిల్లాలో 13 ప్రధాన రోడ్ల బాగుకు నిధులు
- 95.31 కి.మీ మేర రహదారులపై పూడనున్న గుంతలు
- ప్యాచ్ వర్కులకు రూ.34.35 కోట్ల మంజూరు
- మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్లతో అవస్థలు పడుతున్న జిల్లా ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రధాన రోడ్లపై గుంతలు కనిపించ కూడదని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆ క్రమంలో గుంతలు పూడ్చేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే సుమారు రూ.20 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చడం, రోడ్లపక్కన చెట్లను తొలగించే ప్రక్రియ జరుగుతోంది.ఇప్పటికే చాలా వరకూ రహదారులపై గుంతలు పూడ్చారు. ఇప్పుడు మరికొన్ని ప్రధాన రోడ్లను కూడా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జిల్లా ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. మొత్తం 13 రోడ్లపై 95.31 కిలోమీటర్ల మేర ఉన్న గుంతలకు ప్యాచ్‌లు వేసేందుకు నిర్ణయించారు. ఇందుకు గానూ రూ.34.35 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 536 కిలోమీటర్ల దూరం ఎండీఆర్(జిల్లా ప్రధాన రహదారులు) రోడ్లను బాగు చేసేందుకు రూ.200 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేయగా, అందులో ఆర్‌అండ్‌బీ నెల్లూరు సర్కిల్‌లో 30.62 కి.మీ బాగు చేసేందుకు రూ.10.55 కోట్లు మంజూరయ్యాయి. అలానే రాష్ట్రవ్యాప్తంగా 890 కి.మీ రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్) బాగు చేసేందుకు రూ.400 కోట్లు మంజూరు చేయగా, అందులో ఉమ్మడి జిల్లాకు 64.69 కి.మీ బాగు చేసేందుకు రూ.23.80 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు తాజా జాబితాలో ఉన్నాయి. రానున్న నెలరోజుల్లో టెండర్లు పిలిచేలా ఆర్‌అండ్‌బీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టెండర్లు పూర్తయిన మూడు నెలల్లోపు పనులు పూర్తి అయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం కూడా రానున్న వర్షాకాలంలోపు ఎక్కడా కూడా రోడ్లపై గుంతలు కనిపించ కూడదని ఆదేశించింది. మూడు, నాలుగేళ్ల నుంచి ఆగిపోయి ఉన్న ఎన్‌డీబీ రోడ్డు పనులు కూడా ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	280

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8611
వెండి కిలో ధర	రూ. 103200
వెండి ఒక గ్రాము	రూ.106.20

కళారత్న అవార్డు అందుకున్న మాధవరావు

కావలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉగాదిని పురస్కరించుకుని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కళారత్న హంస అవార్డుకు కావలి పుల్లారెడ్డి నగర్‌కు చెందిన వేములపాటి మాధవరావు (మెజీషియన్) ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డును అందుకున్నారు. మాధవరావు నాబార్డు, పలు బ్యాంకుల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలలో గిరిజనప్రాంతాలు, లంబాడీతండాలలో ఆర్థిక అక్షరాస్యత, జలసంరక్షణలపై 3వేలకు పైన ప్రదర్శనలు ఇచ్చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేసింది.

వైభవంగా ఉగాది సంబరం



కలిగిరి : భక్తులను విశేషంగా ఆకట్టుకున్న స్వామివారి ప్రత్యేక రూపం

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన



ఆత్మకూరు : శేషారెడ్డిని సత్కరించి జ్ఞాపికను బహూకరిస్తున్న సభ్యులు

కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి వేదపండితులు ఆశీర్వచనాలు జరిగాయి. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద వృద్ధులు, చిన్నారులకు నూతన వస్త్రాలు, స్వీట్లు, పండ్లు, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవరావు, రవ్వా అరుణ, ఆర్.సాయిలక్ష్మి, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, కోట వెంకటకిషోర్ పాల్గొన్నారు. అలాగే కుటుంబ సమేతంగా గృహాలలో పాలపొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక పూజలు నిర్వహించటంతోపాటు షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించారు. మహిళలు ప్రత్యేకంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ కాంప్లెక్స్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. దుకాణాల యజమానులు స్వీట్లు పంపిణీ చేశారు.



ఉదయగిరి : గండిపాళెం గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● ఉగాది సంబరాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య

వలేటివారిపాలెం : మండలంలోని అంకభూపాలపురంలో ఉన్న తన మేనమామ ప్రెగడ పుల్లయ్యతో పాటు ఆయన కుటుంబసభ్యులతో కలిసి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. పెద్దలకు పొంగళ్లు, దుస్తులు పెట్టుకొని పండుగను జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది పండుగ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రెగడ శ్రీనివాసులు, ప్రెగడ నరసింహారావు, కుంబాల అంజయ్య, పిన్నిక క్రిష్ణయ్య, చెంచు శ్రీనివాసులు, కొండారెడ్డి, పంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే మండలంలో మహిళలు తెల్లవారు జామునే ఇళ్లవద్ద రంగవల్లులు తీర్చిదిద్ది తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అంకమ్మ, పోలేరమ్మ, గంగమ్మ, భ్రమరాంబికా దేవి, ఆంజనేయస్వామి, శివాలయం తదితర దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

● కావలిరూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు తెల్లవారు జాము నుంచే గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడి సేవించారు. మండలంలోని ముందరపొట్టెమ్మ ఆలయంతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు.



కొండాపురం : భీమవరప్పాడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

● బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు, పూజాసామగ్రిని గరుడసేవ సత్రం నుంచి మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, గ్రామ పెద్దలు నాటారు వెంకటరమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు. తాళ్ళూరు విశ్వనాథరావుపేట పంచాయతీల నడుమ అటవీప్రాంతంలోని శ్రీవారి నిజపాదాల వద్ద ఉగాది పర్వదిన సందర్భంగా ఉగాది పచ్చడి పంచిపెట్టారు. టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ నాగేశ్వరరావు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

● కొండాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు

● భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



వలేటివారిపాలెం : అంకభూపాలపురంలో బంధువులతో చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య

స్వీకరించారు. సాయిపేటలో నూతక్కి లక్ష్మీనరసయ్య జీవసమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. బీమవరప్పాడు లోని సీతారామచంద్ర ఆలయంలో అర్చకుడు పులిగండ్ల సురేష్‌కుమార్ శర్మ స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

● కలిగిరి : మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు కుమారస్వామి, తిరుమలస్వామిలు పులిహోర, పండివంటలతో రూపొందించిన వేంకటేశ్వరస్వామి రూపం విశేషంగా ఆకట్టుకుంది.

● అల్లూరు : మండల ప్రజలు తమకు ఇష్టమైన దైవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అల్లూరులోని వేణుగోపాలుడు గ్రామంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులోని వేణుగోపాల స్వామి, పోలేరమ్మ, శివాలయంతోపాటు ఇస్కపల్లిలోని శివాలయం నార్తు మోపూరులోని వరదరాజస్వామి ఆలయం, రామాలయం, శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గీతాశ్రమంలో శ్రీవిశ్వావసు పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహస్రనామ స్తోత్రాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, మోమిడి మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : మండలంలంలోని పెదపవని, చినపవని, వీఆర్ కోట, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, విశ్వనాథపురం, ఎర్రారెడ్డిపాలెం తదితర గ్రామాలలో భక్తులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారిపాలెంలోని అయ్యప్ప



ఉలవపాడు : వేణుగోపాల స్వామి ఆలయంలో పంచాంగం చదువుతున్న అర్చకుడు

ఆలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయగా, పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.

● ఉలవపాడు : మండలంలో ఆలయాలు తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. పసుపు, కుంకుమ, మామిడి తోరణాలతో ఇళ్ల వాకిళ్లకు శోభాయమానం సంతరించుకుంది. ఆలయాల్లో పండితులు చేసిన పంచాంగ శ్రవణం ఆలకించారు. ఉలవపాడులోని వేణుగోపాల స్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో దేవతామూర్తులను ప్రత్యేక అలంకణలతో భక్తులు దర్శించుకున్నారు.

● ఆత్మకూరు : విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం చేశారు. పలు ప్రాంతాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అలఘునాథస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, శివాలయం, తిరునాళ్లతిప్పలోని కాశీ నాయన ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఉదయగిరి : రంగనాయకులస్వామి ఆలయంలో అలనాటి వైభవాన్ని వివరిస్తున్న వేషధారులు

● తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి కవి గురజాడ అప్పారావు వేషధారణతో అలరించారు. నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, తెలుగు భారతి సేవాసమితి గౌరవ సలహాదారు ఎస్‌వి రమణయ్య తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే సదుద్దేశ్యంతో ఉగాది సంబరాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం తెలుగు భారతి సేవా సమితి ఉపాధ్యక్షుడు కెవి శేషారెడ్డికి శాంతి భూషణ్ బిరుదు ఇచ్చి పద్యమందారమాల జ్ఞాపికను అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి సభ్యులు చలమయ్య, నారాయణరావు, సుబ్రహ్మణ్యం, రవీంద్ర కుమార్, నారసింహరెడ్డి, రామమోహన్ రెడ్డి సుబ్బయ్య, ఓంకారం రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సంఘాలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు, తిమ్మరుసు, తెనాలి రామకృష్ణుడి వేషధారణలతో ఉగాది పచ్చడి, గోమాతలతో పట్టణ పురవీధుల గుండా రంగనాయకులస్వామి ఆలయం వరకు మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రంగనాయకులస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. అలాగే మండలంలోని గండిపాళెం, కుర్రపల్లి, బిజ్జంపల్లి, అప్పసముద్రం, కొండాయపాళెం, ఆర్లపడియ, గుడినరవ, చెరువుపల్లి గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అల్లూరు : గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

● దుత్తలూరు: దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు, బ్రహ్మేశ్వరం, కొత్తపేట, ఏరుకొల్లు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో పంచాగ శ్రవణం చేశారు.

● సంగం : ఉగాది సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరుమనకొండలోని రాజరాజేశ్వరాలయం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి విశ్వావసు నామ సంవత్సర విశిష్టతను భక్తులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారుచేసి ఆంజనేయస్వామి గుడి, బస్టాండ్, రాళ్లచెలిక చౌడేశ్వరిదేవి ఆలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయులు. సురేంద్రరెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సురేష్ తదతరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సీతారామపురంలోని గ్రామదేవత అంకాలమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సంగం : ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న అపస్ ఉపాధ్యాయులు

● వింజమూరు : పట్టణంలోని వేద గాయత్రి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం చేసిన అనంతరం కవులు, కళాకారులు తమ కవితలను వివరించారు. ఈ కార్యక్రమంలో పులిచర్ల నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటనారాయణరెడ్డి, మద్దూరు గోపాల్‌రెడ్డి, కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం : గ్రామదేవత అంకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కలువాయి బజారువీధి నుంచి స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకుని భక్తులు మేళ తాళాలతో ఆలయానికి చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు.


వెంగమాంబ కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాలమ్మ దంపతులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ, గురవయ్యానాయుడుల కల్యాణోత్సవాన్ని ఆదివారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ పట్టువస్త్రాలు సమర్పించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

అనంతసాగరం: మండలంలోని గుడిగుంట గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం వంశపారంపర్య ధర్మకర్త అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు సునీత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల అభివృద్ధి టీడీపీకే సాధ్యం : కాకర్ల



ఉదయగిరిలో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉదయగిరి పట్టణంలోని చిన్న మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, టీడీపీ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఉపవాసపరులకు భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం రంజాన్ పర్వదినాన్ని ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, నల్లిపోగు నరసింహా, తుమ్మల కిరణ్, శివకృష్ణ పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల కేంద్రంలోని జామియా మసీద్‌లో మండల జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ముస్లింలకు భోజనాన్ని వడ్డించారు. ముస్లింల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాబు, షేక్ పెద్ద గౌస్, షేక్ అలి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జిల్లా ఎస్సీ కార్యనిర్వహక ఆధికార ప్రతినిధి జాషువా, జిల్లా బీసీ కార్యనిర్వహక ఆధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జిల్లా తెలుగు యువత నాయకుడు సింగాల నాగేశ్వరరావు, తోట మనోజ్‌బాబు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటతో ఎమ్మెల్యే ఇంటూరి భేటీ



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ఆదివారం ఒంగోలులోని ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల శ్రీనివాసులరెడ్డికి హార్ట్ బైపాస్ సర్జరీ జరగడంతో ఆయన ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ నాయకులు ఉన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం, ఆర్టీసీ డిపో సెంటర్ల వద్ద స్కంధపురి సేవా సమితి, అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, కంద్రా మాల్యాద్రి, పువ్వాడి మౌనిక, అఖిల, నేహా, విగ్నేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామివారికి గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, అర్చనాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతోపాటు రెడ్లదిన్నె, పాపంపల్లి, బొటికర్లపాడు తదితర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందనాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవాని తిరునాళ్ల



కలశపు బిందెలతో మహిళ గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లత థియేటర్ ఎదురుగా వెలసి ఉన్న గంగాభవాని తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీవిశ్వావసునామ ఉగాదిని పురస్కరించుకుని ఉదయం పాతూరు శివాలయం నుంచి ఆచారపు (గొల్ల) యాదవులు పర్యవేక్షణలో 901 కలశాలతో మహిళలు జలాలను ఊరేగింపుగా తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ఆ జలాలతో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యంలు పాల్గొని గంగమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించారు. గంగమ్మ కరుణా కటాక్షాలతోనే సమాజం సుభిక్షంగా వర్థిల్లు తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాయంత్రం జరిగిన గ్రామోత్సవంలో అమ్మవారికి స్వాగతం పలుకుతూ బొల్లావులు, వీరతాళ్లు, నెమలి ఆటలు కీలుగుర్రాలు, భద్రకాళి రాక్షసుడి వేషా దారణలో ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు నగళ్ల శ్రీనివాస్ కిరణ్, పీ. అలేఖ్య, నాయకులు బొంతా శ్రీనివాస్ యా దవ్, జనిగర్ల మనోహర్‌యాదవ్, గుండ్లపల్లి రమణయ్య, సన్నిబోయిన నారాయణ, భక్తబృందం పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరపాలి



కావలి : కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కావలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కావలిలో క్రైస్తవులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులోని ఐకాన్ సెల్ఫీ సెంటర్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి ట్రంకురోడ్డు మీదుగా శివాజీ సెంటర్ వరకు వెళ్లి తిరిగి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ క్రైస్తవులు ప్రార్థనలు చేయటంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

●ఉలవపాడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి పట్ల మండలంలోని పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఉలవపాడులోని ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు.

తాగునీటి సమస్యపై గ్రామస్థుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సీతారామపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివారం బిందెలతో గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్నిరోజులుగా రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య తలెత్తిందని, కిలోమీటర్ దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మండు తుండడంతో మూగ జీవాలు సైతం తాగునీటి కోసం అల్లాడుతున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు అధి కారులను కోరుతున్నారు.

హిందూధర్మాన్ని ఆచరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న పోలయ్య, కంచర్ల రామయ్య, డాక్టర్ మల్లికార్జున

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని భారతీయులంతా ఆచరించాలని ఆర్ఎస్ఎస్ మూడు ప్రాంతాల ప్రముఖ్ కోలంగారి పోలయ్య పేర్కొన్నారు. హిందూ ధర్మం అనేది కేవలం హిందూ మతానికి సంబంధించినది కాదని మతం ఏదైనా భారతీయులంతా హిందూధర్మాన్ని పాటించటం ద్వారా దేశాన్ని శక్తివంతంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు కందుకూరు ప్రాంతీయ ఖండ్ సంఘ్‌చాలక్ డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొనగా సంఘ సేవకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

నేతల రంజాన్ శుభాకాంక్షలు

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కలువాయి హిందూ ధర్మ పరి రక్షణ సమితి, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శివసాయి కళాశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శేషగిరిరావు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు రాఘవరెడ్డి, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

వింజమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని మానసిక ప్రశాంతతను పొందవచ్చని ఒంగోలు సీనియర్ మాస్టర్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం వేదవ్యాస పశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు.

2 నుంచి రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్

● జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు



మాట్లాడుతున్న బాలాంజనేయులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : దస్తా వేజుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్ ప్రక్రియను ఏప్రిల్ 2 నుంచి ప్రారంభిస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. ఆది వారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లా డారు. నూతన పద్ధతిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తొలుత నెల్లూరు నగరంలోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభి స్తున్నామని చెప్పారు. తరువాత దశలవారీగా జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తామన్నారు. స్లాట్ బుకింగ్ సమయాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే వారే నిర్ణయించుకో వచ్చని తెలిపారు. ఆ సమా యానికి దస్తావేజులతో పాటు, సాక్షులు, కొను గోలుదారు లు, అమ్మకందా రులు సబ్ రిజిస్ట్రార్ కార్యాల యానికి రావాలని కోరా రు. నిర్దేశిత సమ యానికి రాలేకపోతే ఆ రోజు సాయంత్రంలోగా వీలును బట్టి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. అలా వీలుకాని పక్షంలో స్లాట్ సమ యాన్ని మార్చుకోవాల్సి ఉంటుంద న్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారంతా ఈ స్లాట్ బుకింగ్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉగాది, ఆదివారం అయినా రిజిస్ట్రేషన్లు

ఉగాది పండుగ పైగా ఆదివారం అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. జిల్లా వ్యాప్తంగా 96 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరిగింది. వీటి ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు రూ.96.65 లక్షల ఆదాయం సమకూరింది. కాగా, సోమవారం రంజాన్ పండుగ అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.

అధ్యాపకుడు పీర్‌కుమార్‌కు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు పీర్ కుమార్

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరులోని ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బీ పీర్‌కుమార్‌కు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు నంది అవార్డును అందచేశారు. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజి యంలోని భాస్కర్ ఆడిటోరియంలో రెండురోజుల క్రితం జరిగిన జాతీయ ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఈ అవార్డును అంద చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన నెల్లూరులో నివాసం ఉంటూ గూడూరు కళాశాలలో పనిచేస్తూనే పాటలు, నాటికలను రచించడం, చిన్న పాత్రల ద్వారా నటనలో ప్రతిభను కనబరుస్తుం డడంతో ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఫౌండేషన్ ఎండీ పీ శిరీషరెడ్డి, నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా బంగారు నంది అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని పీర్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు

'లెక్క'లేనితనం !

ఇటీవల జరిగిన నెల్లూరు నగర పాలక సంస్థ బడ్జెట్ సమా వేశం అంతుచిక్కని ఆర్థిక లెక్కలకు వేదికగా మారింది. రూ.కోట్ల ప్రజాధనాన్ని పందేరం చేశారనే వాస్తవం వెలుగు చూసింది. ఎన్‌ఎంసీ గల్లాపెట్టెకు చేరు తున్న నిధిని చెల్లా చెదురుగా వాడేయడం పట్ల నగరవాసులు గుర్రుమంటున్నారు. తాము కట్టే పన్నులను బాధ్యత లేకుండా ఖర్చుపెడతారా!? అంటూ నిల దీస్తున్నారు.

- నగరపాలక సంస్థలో ఇష్టానుసారం ఖర్చులు
- మేయర్ పేషీలోనే రూ.8 లక్షలట !
- పురుడుపోసుకోని ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.70 లక్షలు
- సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రూ.3 కోట్లు?
- మూగజీవాల పేరిట రూ.95 లక్షలు..
- బడ్జెట్ సమావేశంలో సభ్యుల నిలదీత
- అధికారుల నుంచి రాని సమాధానం

నెల్లూరు (సిటీ), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పోలీసుశాఖతోపాటు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీకి కట్టబెట్టారు. టెండర్ల దశ కూడా పూర్తయింది. ఇందుకు సంబంధించిన సామగ్రి వచ్చిందని, ప్రాథమిక దశ కూడా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఇవేమీ కంటికి కనిపించడంలేదు. మొత్తంమీద సదరు కంపెనీకి ఏకంగా రూ.70 లక్షలు ఆర్థిక చెల్లింపులు చేసినట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు. మరో రూ.1.50 కోట్లు కూడా కేటాయింపులు జరిపారు. దీనిపై ఇటీవల జరిగిన బడ్జెట్ మీటింగ్‌లో సభ్యులు గళమెత్తినా అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. ఇక మూగజీవాలను కూడా వదలని కార్పొరేషన్ అధికారులు వాటిపై ఏకంగా రూ.95 లక్షలు ఖర్చు చేసినట్లు స్పష్టంగా లెక్కల్లో చూపారు. ఇందులో రోడ్లపై ఉన్న ఆవులను కల్లూరిపల్లి గోశాలకు తరలించడానికి రూ.15 లక్షలు ఖర్చయిందని, నగరంలోని కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేయించడానికి రూ. 80 లక్షలు ఖర్చయినట్లు పద్దులో పేర్కొన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. కోటి కేటాయింపులు జరపడం గమనార్హం.



నగర కార్పొరేషన్ కార్యాలయం

● మేయర్ పేషీ ఖర్చులు

మేయర్ కారు వినియోగానికి ఏడాదికాలం పెట్టే ఖర్చు రూ.7.2 లక్షలు కానీ ఆమె పేషీలో అదే ఏడాదికాలం పెట్టిన ఖర్చు రూ.8 లక్షలు. వినేందుకు కాస్త ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. సాక్షాత్తు అధికారులు తాజాగా బడ్జెట్‌లో చూపిన లెక్కలివి. రూ. 8 లక్షలకు ఏం ఖర్చు చేశారు. ఎవరికి ఖర్చుపెట్టారు..? అంటూ కార్పొరేటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ప్రశ్నలు ప్రశ్నలు సంధించినా అధికారులే కాదు.. మేయర్ వద్దకూడా సమాధానం లేదు. నగరంలో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ స్ప్రేయింగ్ ఆయిల్ కొనుగోలుకు రూ. 15 లక్షలు, ఫాగింగ్ ఆయిల్ కొనుగోలుకు రూ. 30 లక్షలు ఖర్చు చేశామని అధికారులు లెక్కల్లో చూపారు. కానీ కార్పొరేటర్లు తమ డివిజన్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని పద్దు సమావేశంలో తేల్చిచెప్పారు.

ఆ రూ.3 కోట్లు ఏమైనట్టు?

సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిధులిస్తుంది. ఆర్వో నేతృత్వంలో వీటిని ఖర్చు చేస్తారు. కానీ కార్పొరేషన్ నిధి నుంచి ఏకంగా రూ.3 కోట్లు ఎన్నికల నిర్వహణకు వాడేశారు. ఒక్క సిటీ నియోజక వర్గానికి ఇంత ఖర్చా? ఏం పెట్టారు? ఎక్కడ పెట్టారు? జిల్లాలో అన్ని నియోజవర్గాలకు ఈసీ రూ. 50 లక్షల చొప్పున ఇచ్చింది. సిటీకి కూడా రూ. 50 లక్షలు వచ్చాయి. కానీ అవిచాలక రూ. 3 కోట్లు దేనికి ఖర్చు చేశారు? అన్నది అధికారులు, రాజకీయ నేతల్లో వెంటాడుతున్న ప్రశ్న. ఈ విషయాన్ని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కమిషనర్ సూర్యతేజ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే తప్ప వాస్తవాలు బయటకు రావు.

పండగలొస్తే 'పండగే' !

సాధారణంగా ఏ మున్సిపాలిటీలోనైనా పండగ లొస్తే అధికారులకు తలనొప్పి. కానీ నెల్లూరులో మాత్రం 'అవినీతి పండగే'. రొట్టెల పండుగ, రంజాన్, సంక్రాంతి, గొబ్బెమ్మ, దసరా, బక్రీద్ వంటి ప్రముఖ పండుగలు వచ్చాయంటే చాలు పారిశుధ్య నిర్వహణ పేరిట దోచుకున్నోడికి దోచుకున్నంత. ఈ ప్రత్యేక రోజులను సాకుగా చూపి ప్రైవేట్ కూలీలను రంగం లోకి దింపి అందినకాడికి దోచుకోవడం కార్పొరేషన్‌లో ఆనవాయితీగా మారింది. ఇక లైట్లు, షామియానాలు, మంచినీరు, బ్లీచింగ్ వంటి సౌకర్యాలను చూపి మరిం తగా లెక్కల్లోకి ఎక్కించేస్తారు. ఇలా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.4 కోట్లు ఖర్చు చేయడం విస్మాయానికి గురి చేస్తోంది. 2023-24లో రూ.1.32 కోట్లు ఖర్చు చేస్తే 2024-25లో రూ.4 కోట్లు ఖర్చుకిం ద చూపారు. 2025-26లో మరో రూ.4 కోట్లు కేటా యింపులు జరిపారు. వీటిపై ఇటీవల జరిగిన కౌన్సిల్లో సభ్యులు ప్రశ్నించగా, అప్పటికీ ఖర్చు తగ్గించామని అధికారులు బదులివ్వడం విశేషం.

తాగునీటి సమస్య చెప్పడానికి కాల్ సెంటర్లు

- నీటి ఎద్దడి రాకుండా పటిష్ఠ చర్యలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకట రమణ

నియోజకవర్గం	కాల్‌సెంటర్ నెంబరు
నెల్లూరు రూరల్	9100121753
కోవూరు	9100121753
కావలి	9100121779
ఆత్మకూరు	9100121783
వెంకటగిరి	9100121783
కందుకూరు	9100121718
ఉదయగిరి సబ్‌డివిజన్	9100121758
వింజమూరు సబ్ డివిజన్‌కు	9100121768
నెల్లూరు ఈఈ	9100121749
ఎస్ఈ	9100121701

నెల్లూరు (జడ్పీ), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా అన్నీ పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని గ్రామీణ నీటిపారుదల (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ ఎస్ఈ వెంకట రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో కాల్ సెంటరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఏర్పడితే ఈ నెంబర్లతోపాటు డీఈఈ, ఎస్ఈ నెంబర్లకు ఫోన్ చేసి తెలియ జేయాలని కోరారు. ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, కందు కూరు మండలాల్లోని 47 గ్రామాలకు వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని గుర్తించామని తెలి పారు. దానిని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, నిధుల మంజూరుకు ఆమోదం లభించిందని వివరించారు. అవసరమైన చోట్ల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని, పైప్‌లైన్లు, మోటర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేయిస్తామన్నారు.

- ఎగసిపడిన మంటలు
- ఆర్పడానికి ఆరు గంటలకుపైగా శ్రమించిన ఫైర్ సిబ్బంది
- రూ.50 లక్షలకుపైగా ఆస్తినష్టం

సీసీ కెమెరాల స్పేర్స్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం



మూడవ అంతస్తుపైకి నిచ్చెన వేసి మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో శనివారం రాత్రి భారీ అగ్నిప్ర మాదం సంభవించింది. అయ్యప్ప గుడి సమీపంలోని విక్రమ్ నగర్ లో ఉన్న ఓ భవనం పైభాగంలో శ్రీధర్ అనే వ్యక్తి సీసీ కెమెరాలకు సంబంధించిన స్పేర్ పార్ట్స్, ఎక్స్‌పోర్ట్ కార్యాలయం నిర్వహిస్తు న్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో కార్యాల యం మూసివేసి సిబ్బంది వెళ్లిపోయారు. రాత్రి 11 గంటల సమయంలో ఆ కార్యాలయం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పెద్ద.. పెద్ద శబ్దాలు కూడా రావడంతో చుట్టుప్రక్కల ప్రజలు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఏడీఎఫ్‌వో వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెండు ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఫోమ్ కొట్టినా, నీళ్లు చిమ్మినా మంటలు అదుపులోకి రాలేదు. పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ నుంచి నీరు కొట్టినా ఉపయోగం లేకుండా పోయింది. చివరికి పక్కనున్న మూడు అంతస్థుల భవనానికి నిచ్చెన వేసి దానిపైనుంచి నీళ్లు కుమ్మరించి మంటలను ఆర్పారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల వరకు ఫైరు ఇంజన్లు తొమ్మిదిసార్లు నీళ్లు నింపుకుని రావలసి వచ్చింది. ప్రమాదం జరిగిన కార్యాలయాలో సీసీ కెమెరాలకు సంబంధించిన అడాప్టర్లు, వైరింగ్ సామగ్రి, బ్యాటరీలు అధికంగా ఉన్నాయని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయని ఫైర్ అధికారులు భావిస్తున్నారు. కాగా, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెక్కులు అందుకున్న వారితో మంత్రి నారాయణ

సీఎం సహాయనిధి పంపిణీ

● చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 15 మందికి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం చెక్కులు అందించారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాల యంలో రూ.17,82, 382లకు చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్ష కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ఆయన వెల్లడించారు.

కోడిపందెం స్థావరంపై దాడి



పట్టుబడిన జూదరులతో రూరల్ పోలీసులు

నెల్లూరు రూరల్, మార్చి30, (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని నారాయణ రెడ్డిపేట వద్ద కోడిపందేల స్థావరంపై ఆదివారం రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఆకస్మిక దాడి చేశామని సీఐ గుంజి వేణు తెలిపారు. 11 మంది జూదరులతోపాటు రెండు కోళ్లు, రూ. 11,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరందరిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి మహిళ మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని అయ్యప్పగుడి సమీపంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన జ్యోతి(49), పురుషోత్తం దంపతులు మనస్పర్థల కారణంగా వేర్వేరుగా జీవిస్తున్నారు. జ్యోతి వారం కిందట అయ్యప్పగుడి సమీపంలోని తన తల్లి సరస్వతమ్మ వద్దకు వెళ్లింది. శనివారం రాత్రి ఆమె వాకింగ్ చేసేందుకు మిద్దెపైకి వెళ్లింది. కొద్దిసేపటికి సరస్వతమ్మ మిద్దెపైకి వెళ్లి చూడగా కుమార్తె కనిపించలేదు. దీంతో ఆమె కిందకు వెళ్లి చూడగా కుమార్తె తలకు తీవ్రగాయామై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆమె వెంటనే జరిగిన విషయాన్ని తన మనుమడు లీలామోహన్‌కు తెలియజేసింది. ఆయన ఇంటివద్దకు చేరుకుని తల్లిని చికిత్స నిమిత్తం జయభారత్ వైద్యశాలకు అక్కడి నుంచి నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. లీలామోహన్ ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఎస్ఐ

● పోలీసుల అదుపులో రెండు టిప్పర్లు, ఓ ఎక్స్‌కవేటర్



గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను నిలిపివేసి సిబ్బందిని అదుపులోకి తీసుకున్న అడ్డుకున్న ఎస్ఐ భోజ్య

బిట్రగుంట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో రాత్రి సమ యాల్లో అక్రమంగా జరుగు తున్న గ్రావెల్ తవ్వకాలను స్థానిక తిప్ప ఎస్ఐ భోజ్య ఆదివారం అడ్డుకున్నారు. గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లతో పాటు గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాల సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల యథేచ్ఛగా జరుగుతున్న గ్రావెల్ అక్రమ రవాణాపై ఎస్ఐ నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అల్లిమడుగు సంఘం సమీపంలో గ్రావెల్ తవ్వి తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు కోవూరుపల్లికి చెందిన మన్నేపల్లి శీనయ్యకు సంబంధించిన వాహనాలుగా తెలిసిందని, ఈ మేరకు . కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ నుంచి దూకి డ్రైవర్ మృతి


కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి న ట్రాక్టర్ నుంచి దూకి డ్రైవర్ మృతిచెందిన సంఘటన ఆదివారం ఉదయం మండలంలోని లలితానగర్ సమీ పంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివ రాలు ఇలా ఉన్నాయి. కొలపనాయుడుపల్లికి చెందిన పారి రవీంద్ర (34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం వరి గడ్డి కోసం గార్లపాడుకు ట్రాక్టర్ తీసుకువస్తుండగా లలితానగర్ సమీపంలోకి వచ్చేసరికి అడ్డంగా వచ్చిన పందిని ఢీకొని ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో భయానికి గురైన డ్రైవర్ రవీంద్ర కిందకు దూకేశాడు. తీవ్ర గాయాలైన అతడిని వైద్యం కోసం ఆదూరపల్లికి తరలించిన కొద్దిసేపటికి మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం

● రూ.8 లక్షల నష్టం

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన కొప్పోలు తిరుపతయ్య, వెంకటసుబ్బయ్య, బ్రహ్మానందం, వెంకట సుబ్బయ్యలకు చెందిన బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకురాలి గొట్టాలపై పడడంతో దగ్ధమయ్యాయి. బ్యారన్ల దగ్ధంతో సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. సమాచారం అందు కున్న ఉదయగిరి అగ్నిపమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మోటార్‌బైక్ బోల్తాపడి నలుగురికి గాయాలు



తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న తిరుపతయ్య

ఉదయగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడి నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కుర్రపల్లి గ్రామం వద్ద ఆది వారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మర్రి పాడు మండలం బెడుసుపల్లి గ్రామానికి చెందిన జెర్రి పోతు తిరుపతయ్య, భార్య రమాదేవి, కుమారుడు శ్యామ్, కుమార్తె సహస్రతో కలిసి ఉగాది సందర్భంగా సీతారామపురం మండలం ఘటికసిద్ధేశ్వరానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కుర్రపల్లి గ్రామ సమీ పంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్ర మాదంలో తిరుపతయ్య, రమాదేవిలకు తీవ్ర గాయాలు కాగా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించ డంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

బాణసంచా పేలి బాలుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు

కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు టపాసు పేలి మేకల చిన్న ఆదెయ్య అనే బాలుడికి తీవ్ర గాయాలైన సం ఘటన ఆది వారం స్థానిక గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల సమా చారం మేరకు... స్థానిక గిరిజన కాలనీలో ఓ కుటుంబం ఆదివారం పోలేరమ్మకు మొక్కులు చెల్లించు కునేందుకు బాణసంచా కాల్చు కుంటూ గుడికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకు న్నారు. అనంతరం వారి ఇంటి సమీపంలో బాలుడు ఆడుకుంటుండగా పెద్దగా పేలుడు శబ్దం వచ్చింది. వెంటనే చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా బాలుడికి తీవ్రగాయాలు కావడంతో 108లో వైద్యశాలకు తరలించారు.

టిప్పర్ కింద పడి అన్న దుర్మరణం

- తమ్ముడి పరిస్థితి విషమం
- బిహారీ కూలీల ఇంట విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

నెల్లూరు(క్రైం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను బైక్‌తో ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే టిప్పర్ వెనుక చక్రాల కిందపడి ఓ కార్మికుడు మృతి చెందగా వెనుక కూర్చుని ఉన్న అతని తమ్ముడి పరిస్థితి విషమంగా ఉంది. నెల్లూరు ట్రాఫిక్ పోలీసుల సమాచా రం మేరకు... బిహార్‌కు చెందిన హరిరామ్ కుమార్, సీతారామ్ అన్నదమ్ములు. వారు వలస కూలీలుగా ఏడాదిన్నర క్రితం నెల్లూ రుకు వచ్చారు. హరిరామ్‌కుమార్‌కు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. అన్నదమ్ములు భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తు న్నారు. ఆదివారం నగరంలోని నాలుగు కాళ్ల మండపం నుంచి బోసుబొమ్మ వైపు బైక్‌పై వస్తున్నారు. ఆర్‌కేటీ పెట్రోలు బంకు సమీపంలో ముందు వెళుతున్న టిప్పర్‌ను అధిగమించే ప్రయత్నంలో వీరి వాహనం టిప్పర్ వెనుకవైపు తగిలింది. దీంతో బైక్ అదుపుతప్పి నేరుగా టిప్పర్ వెనుక చక్రం కిందకు ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. ఈ ప్రమాదంలో హరిరామ్‌కుమార్ తలపగిలి అక్కడికక్కడే మృతి చెందగా సీతారామ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు 108 సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ ఘటన స్థలాన్ని పరిశీలిం చారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అన్న మృతి, తమ్ముడి పరిస్థితి విషమం కావడంతో ఆ కూలీల ఇంట విషాదం నెలకొంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	280
కోడిగుడ్ల ధర (470) :	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాముధర	రూ.8611
వెండి కిలో ధర	రూ.1,03200
వెండి ఒక గ్రాము	రూ.106.20

న్యూస్ బాక్స్

ఏసీ స్టేడియంలో కంటి పరీక్షలు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడ్రన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో గ్లకోమా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు భారతి, చిన్మయి, విష్ణుప్రియ వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణ వెంకయ్యకు అంబేడ్కర్ పురస్కారం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాలల జేఏసీ కన్వీనర్ డాక్టర్ స్వర్ణ వెంకయ్యకు ఆదివారం ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

నరేంద్రకు జాతీయ అవార్డు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ధనలక్ష్మీపురం వీబీఆర్ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కే నరేంద్ర జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఈ విద్యాసంవత్సరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. ఏప్రిల్ 13న అవార్డు అందజేయనున్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

● మంత్రి నారాయణకు 'హంస' వినతి

నెల్లూరు (వైద్యం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించేలా సహకారం అందించాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు హంస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజెర్ల సుధాకర్ రావు వినతిపత్రం అందించారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఎంతో కాలంగా ఉద్యోగోన్నతుల కోసం సిబ్బంది వేచి చూస్తున్నారని చెప్పారు. అలాగే, పలు సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో హంస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

పొదలకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం పేద ముస్లింలకు రంజాన్‌తోఫా, దుస్తులు పంపిణీని ముస్లిం మత గురువు మౌలానా ముస్తాక్ మదనీ దాతల సహకారంతో పేద ముస్లిం మహిళలకు రంజాన్‌తోఫా,దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ హనీఫ్ పాల్గొన్నారు. 200మందికి రూ.వెయ్యి నుంచి రూ.1500విలువైన రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జమీర్‌బాషా, మహమ్మద్ అబ్బాస్ షరీఫ్, షేక్.దస్తగిరి, టీవీఎస్ ఫయాజ్, షేక్ అహ్మద్‌బాషా, మంజూర్, సుభాన్‌బాషా, ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

కొడవలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేడ్కర్ యూత్ సభ్యుడు ఎంపాల హర్షవర్ధన్ జన్మదినం సందర్భంగా ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు సుజిత్, శ్రీనివాస్, శ్రీను, జీవన్, చందు, భవదీప్, చరణ్, అంజనీ, చందు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి):పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహఆశ్రమంలో గాంధీ ఆశ్రమ కమిటీసభ్యులు కందికట్ల రాజేశ్వరి, బీజేపీ మండలాధ్యక్షులు కైలాసం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు, ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, గాంధీ, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాలలు సమర్పించారు. అనంతరం కందికట్ల రాజేశ్వరి పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాలలు సమర్పించారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మీ, లలితమ్మ, వెంకట్రావు, సుదీప్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాంబాబు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు









నగరోత్సవంలో గ్రామదేవత ఇరగాళమ్మ

అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం

నిప్పులకుండ, వేప మండలతో భక్తుడు

ఆలయంలో భక్తుల రద్దీ

ఇరగాళమ్మా.. చల్లగ చూడమ్మ!

● గ్రామదేవతకు వైభవంగా ఉగాది నగరోత్సవం

● ఆలయాల్లో ఉత్సవాలు, భక్తుల రద్దీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరికి ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు అర్పించారు. కాగా, అమ్మవారి దర్శనానికి ఉదయం 5గంటల నుంచే భక్తులు బారులుతీరారు. ఆదివారం కూడా కావడంతో అమ్మవారికి చద్ది, అంబలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు, మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం జరిగింది. రంగనాథ స్వామి ఆలయం నుంచి సంప్రదాయబద్ధంగా ఇరగాళమ్మకు ఉగాది సారెను సమర్పించారు. ఆలయ ఈవో గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేంద్రయాదవ్, కమిటీ సభ్యులు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

● మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఉదయం మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరిగాయి. సాయంత్రం పంచాంగ శ్రవణం, శివపార్వతుల కల్యాణం, నందివాహన సేవ జరిపారు. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా తిరుమంజనం సేవలు నిర్వహించారు. ఈవో వేమూరు గోపి పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. భక్తులు ఉదయం అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, బియ్యం, ఇతర వస్తువులు సమర్పించి అందరికీ మేలు జరగాలని కోరుకున్నారు. రాత్రి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయం చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక చైర్మన్ షేగు షణ్ముఖరావు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

● రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో అమ్మవారికి విశేష అభిషేకాలు, పూలంగిసేవ, చండీ హోమం జరిగాయి. సాయంత్రం పంచాంగ శ్రవణం, కోలాట ప్రదర్శన, కుంభహారతులు, పులివాహనంపై ప్రాకారోత్సవం నిర్వహించారు.

రంగనాథ స్వామి ఆలయంలో మంత్రి నారాయణ దంపతులు



వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

శబరి శ్రీరామక్షేత్రంలో ఆదివారం రాత్రి వసంత నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఉదయం ఉగాది వేడుకలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు 6వతేదీ వరకు జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని ఆలయ వ్యవస్థాపకులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి కోరారు.

● నవాబుపేట శ్రీకృష్ణ ధర్మరాజుస్వామి ఆలయంలోనూ వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

● **స్టేడియంలో సంబరాలు**

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్, స్టేడియం వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఉగాది సంబరాలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. వాకర్స్ అందరికీ ఉగాది పచ్చడి పంచారు. ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడు కిలారి శ్రీని వాసులు నాయుడు, కార్యదర్శి జీ నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, గవర్నర్ బలరామయ్యానాయుడు, స్టేడియం వాకర్స్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, వేలూరు రంగారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

దైవానుగ్రహంతోనే పనులు పూర్తి : హంపీ పీఠాధిపతి

ట్రంకురోడ్డు శివాజీ సెంటర్‌లో సింహపురి ఉగాది వేడుకలు జరిగాయి. ఉదయం సింహపురి ఉగాది ఉత్సవ కమిటీ, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు చేశారు. సాయంత్రం హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానా ధీశులు విద్యారణ్య భారతీ మహాస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలు చేపట్టే ఏ కార్యక్రమమైనా దైవానుగ్రహంతోనే పూర్తవుతుందని తెలిపారు. నిత్యం దైవారాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ సమాజంలో ఉగాది వేడుకలు



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమా జంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు జరిగాయి. సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచల య్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మాచవోలు భాస్కర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం అందరికీ ఉగాది పచ్చడి ప్రసా దం పంచారు. బత్తిన సాయి కుమార్‌రెడ్డి ఉగాది విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో రమణయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఉగాది సందర్భంగా బయ్యా వెంకట రమణయ్య, సరోజనమ్మ జ్ఞాపకార్థం మినీబైపాస్‌రోడ్డులోని కాంచీపురం పెరుమాళ్ షోరూమ్‌లో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. ఈ చలివేంద్రం 100 రోజులు కొనసాగుతుందని షోరూమ్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, బయ్యా రంగమల్లిక పాల్గొన్నారు.

● **వస్త్ర దానం..**



రంజాన్ పర్వదినం సందర్భంగా నేతాజీనగర్ 4వవీధిలో అల్లూరు రహీం పేదలకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి టీ బాల సుధాకర్, గౌసియా, ఆషిక్, సుమీయా అర్వాన్, షేక్ అల్లాహ్ ఉద్దీన్ పాల్గొన్నారు.

పీ4 సభకు ప్రత్యేక బస్సు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పేదరిక రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని నెల్లూరు ఆర్డీవో అనూష పిలుపునిచ్చారు. నిరుపేదలను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమ సభకు నెల్లూరు డివిజన్ నుంచి అమరావతికి బస్సుని పంపుతున్నట్లు తెలిపారు. పలు వర్గాలకు చెందిన 40 మంది సభ్యులతో కూడిన బస్సును ఆదివారం ఆమె కార్యాలయం వద్ద ప్రారంభించారు.

పీఎంపీ వేణుగోపాల్‌కు సత్కారం

నెల్లూరు (వైద్యం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పీఎంపీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్‌ను ఆదివారం నగరంలోని వియానీ హోంలో సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకిచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డులు, రివార్డులకు అతీతంగా వేణుగోపాల్ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా రూడ్స్ సేవాసంస్థ చైర్మన్ రసూల్ ఉగాది పురస్కారం అందుకోవటం శభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, గోరంట్ల శేషయ్య, సిస్టర్ రమ, మ్యాగీ, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఊరూరా భక్తిశ్రద్ధలతో ఉగాది పూజలు

రాపూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):విశ్వావసునామ ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం పెంచలకోన క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేకం చేసి పట్టువస్త్రాలు రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామిని అలంకరించి పూజలు చేశారు. చారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. మధ్యాహ్నం స్వామి వారు బంగారు గరుడ వాహనంపై కోన మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవారికి కల్యానం జరిపారు. సాయంత్రం గోనుపల్లిలో ఉగాది ఉత్సవాన్ని ప్రధాన అర్చకులు నిర్వహించారని ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

● విడవలూరు (ఆంధ్రజ్యోతి):స్థానిక అంకమ్మకు భక్తులు పొంగళ్లు సమర్పించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. వేడుకల్లో పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు పాల్గొన్నారు. పార్లపల్లి, ముదివర్తి, అన్నారెడ్డిపాళెం, ఊటుకూరు, రామతీర్థం పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించారు.

●బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి):మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ పురోహితులు గొల్లనపల్లి శ్రీధర్‌శర్మ కుంభహారతి మండపంలో పంచాన్గశ్రవణం చెప్పారు. అనంతరం నిర్వహించిన పారువేట ఉత్సవం పెనుబల్లి వరకు సాగింది. జొన్నవాడ వాసిపల్లి శ్రీనివాసులురెడ్డి దంపతులు అమ్మవారికి 18గ్రాముల బంగారు, శ్రీకాళహస్తికి చెందిన మీనాక్షి 11గ్రాముల బంగారు నక్లెస్‌లు కానుకగా సమర్పించారు. ఆలయ వేద పండితులు గోపాల కృష్ణయ్య,అర్చకులు ముదివర్తి హరనాథ్‌కు మార్, శ్రీశైలం సతీష్‌కుమార్‌లకు ఈఓ ఏవీ.


రాపూరు: బంగారు గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

శ్రీనివాసులురెడ్డి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. అలాగే జొన్నవాడ వరదరాజ స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. రేబాల పుట్టాలమ్మ అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. వేడుకలో బంగారుచీర దాతలు కోడూరు నిరంజన్‌రెడ్డి కుటుంబసభ్యులు, అభయాంజనేయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): ఈదగాలి పంచాయతీ పాతూరు మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం కనులవిందుగా సాగింది. ఉభయకర్తలుగా చల్లా నాగార్జున్‌రెడ్డి, ఏడుకొండలు, అశోక్, వెంకటేశ్వర్లు, హరి వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు ఉదయం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సతీమణి సోమిరెడ్డి జ్యోతమ్మ, సోమిరెడ్డి అక్క కట్టంరెడ్డి సంయుక్తమ్మ, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్ రెడ్డి, చల్లా యామిని దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

● తోటపల్లిగూడూరు (ఆంధ్రజ్యోతి): కోడూరు పంచాయతీ ముక్కంటమ్మ అమ్మవారికి తుళ్లూరు శేషు, మాధవి దంపతులు, గ్రామస్థులు ఉభయకర్తలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.


గరుడవాహనంపై వరదరాజస్వామి


వెంకటాచలం: పూజలో పాల్గొన్న సోమిరెడ్డి జ్యోతమ్మ తదితరులు

ఈకేవైసీకి ఈ-పోస్ ఇక్కట్లు

● పొదలకూరు మండలంలో 6125 ఈకేవైసీ పెండింగ్

పొదలకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ కష్టాలు మరోసారి వచ్చాయి. మండలంలో సుమారుగా 2,1516 కార్డుదారులున్నారు. అందులో 59,095 యూనిట్లకు గాను 52,971 యూనిట్లు ఈకేవైసీ పూర్తవగా 6125 యూనిట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు సివిల్ సప్లై డీటీ రవికుమార్ తెలిపారు. వీరిలో ఐదేళ్లలోపు వారు, 75 ఏళ్ల పైబడి ఉన్నవారు వేలి ముద్రలు వేయడానికి అవస్థలు పడుతున్నారు. ఈ-పోస్ మిషన్లలో పలు ఆప్షన్లు నమోదయ్యాయి. వివిధ స్థాయిలోని ఈ ఆప్షన్లలో ఎర్రర్ వస్తే మిస్సింగ్ బయోమెట్రిక్ డేటా సీఐడీఆర్ ఆధార్ కేంద్రంలో బయోమెట్రిక్‌లను నవీకరించాలి. 996, 997 ఎర్రర్ వస్తే ఆధార్ క్యాన్సిల్డ్ ఆధార్ కేంద్రంలో కొత్త ఆధార్‌ను చేసుకోవాలి. ఇలాంటి ఆప్షన్‌లోని కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీరుగారిన లక్ష్యం

● 10ఏళ్ల కిందట కోవూరులో ఎన్టీఆర్ సుజల పథకం ఏర్పాటు

● వైసీపీ హయాంలో కొరవడిన పర్యవేక్షణ

● మరమ్మతుకు నోచుకోని నీటి యంత్రం పరికరాలు

● తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనం


కోవూరులోని మంచినీటి ట్యాంకు

కోవూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో పదేళ్ల కిందట ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల పథకం నేడు నిరుపయోగంగా మారింది. పథకం ప్రారంభించిన కొన్నిరోజులు ప్రజలకు తాగునీరు పు ష్కలంగా సరఫరా చేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పథకం నిర్వ హణను పట్టించుకోక పోవడంతో లక్ష్యం నీరుగారి పోయింది. కొద్దిపాటి మరమ్మత్తులకు గురైన పథకాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు పట్టించుకోక పోవడంతో పట్టనంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకం యంత్రాలకు మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. నెల్లూరు నగరానికి చెందిన ఓ సంస్థ ఈ పథకాన్ని దత్తత తీసుకొందని మరమ్మతులు చేయాల్సిన బాధ్యత కూడా ఆ సంస్థదే అని అధికారులు చెబుతున్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లోపించడంతోనే ఈ స మస్య నెలకొందని స్థానికులు వాపోతున్నారు. చే సేదిలేక జనాలు తాగునీటి క్యాన్లను ప్రవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



సమస్యను పరిష్కరించేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదు. పథకంలోని యంత్రాలకు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేయాలి. ఎండలకు ఇబ్బంది పడుతున్నాం.

- యాకసిరి హరిబాబు, కోవూరు

అధికారులు స్పందించాలి




పథకం సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకోమని అధికారుల్నికోరుతున్నాం. కార్యాలయాలకు వెళ్లి వినతులిచ్చినా వారు స్పందించరు. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన పథకం నీరుగారి పోవడం బాధకరం.

- మోహనరావు, పాటూరు రోడ్డు, కోవూరు



జేసీ శుభం బన్సల్ తదితరుల నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న భరత్‌శర్మ - డాక్టర్ భారతి, సుధాకర్, ఉషాకళావత్, బాలకృష్ణారెడ్డి, డాక్టర్ వెంకటరమణారెడ్డి





పంచాంగ పఠనం చేస్తున్న కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ

సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వంగా కొనసాగించాలి

- ఉగాది వేడుకల్లో జేసీ శుభం బన్సల్ పిలుపు
- పదిమందికి పురస్కారాల ప్రదానం

తిరుపతి(కల్చరల్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, వేద విజ్ఞానం, సనాతన సంప్రదాయాన్ని వారసత్వంగా కొనసాగించాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించారు. కూచిపూడి నృత్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు భావనారాయణాచార్యులు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. శనివారం జరిగిన పోటీల్లో జూనియర్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన 10 మందికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

వారు.. సాహిత్య రంగంలో డాక్టర్ కృష్ణవేణి, సంగీత రంగంలో ఎం.సుధాకర్, అవధానంలో ఉప్పుదడియం భరత్‌శర్మ, వాయిద్యంలో డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ టి.భారతి, డాక్టర్ ఉషా కళావత్, సామాజిక సేవలో డాక్టర్ పైడి అంకయ్య, రాష్ట్రీయ సేవా సమితి బాలకృష్ణారెడ్డి, పర్యావరణ పరిరక్షణ రంగంలో పాలేటి శివాజీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, పర్యాటక శాఖ ఆర్డీ డాక్టర్ రమణప్రసాద్, జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వ శుభకరం

శ్రీకాళహస్తి, మార్చి30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం సర్వ శుభకరంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన పంచాంగ పఠనం చేశారు. ద్వాదశ రాశుల వారి గ్రహగోచారాలను వినిపించారు. ఏయే రాశుల వారి ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానం వంటి అంశాలు ఎలా సాగుతాయన్న విషయాలను వివరించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి సమాజం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. భూముల వ్యాపారాలు పుంజుకుని రియల్‌ఎస్టేట్ వారికి మంచి ఆదాయం వస్తుందన్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా కళారత్న, ఉగాది పురస్కారాలు

ఉగాది పురస్కార గ్రహీతలు



తులసీనాథం నాయుడు | పురుషోత్తం నాయుడు | ఆకుల మల్లేశ్వరరావు | శ్రీవాణి ఎల్లా | మునిమల్లికార్జున | పద్మనాభం | వీఆర్ రాసాని | ఉషారాణి | సాధుల మునిరత్నం | కిరణ్ క్రాంతి చౌదరి | కంపల్లె రవిచంద్రన్ | ఆముదాల మురళి



విజయవాడలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారాలను అందుకుంటున్న ద్వారం లక్ష్మి

ముక్కంటీశుడికి ప్రత్యేక అభిషేకాలు



భిక్షాల గాలిగోపురం వద్ద ఉగాది స్వాగత ఆర్చి

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉగాది సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. స్వామివారి గర్భాలయం ముందు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఈవో బాపిరెడ్డి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయఅధికారులు కృష్ణారెడ్డి, నాగభూషణం యాదవ్, హరియాదవ్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం లోపల, వెలుపల ఏర్పాటు చేసిన పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.



భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఈవో బాపిరెడ్డి



చందనాలంకారంలో చెంగాళమ్మ

విశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఉగాదికి కళకళలాడిన కొండ



శ్రీవారి ఆలయం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అలంకరణలు



ఆలయం ముందు పురాణ ఘట్టాల సెట్టింగ్

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం తిరుమల కొండ కళకళలాడింది. శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్. తొలిసారిగా కాలిఫోర్నియా, కొలంబియా నుంచి ట్రిసిలియం, డెల్ఫీనియం అనే పుష్పాలను తెప్పించి అలంకరించారు. ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఏర్పాటు చేసిన పల్లకిలో శయనిస్తున్న శ్రీనివాసుడు, ఇరువైపుల గరుత్మంతుడు, హనుమంతుడి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక, రాధాకృష్ణులు, వేణుగానం చేస్తున్న చిన్నకృష్ణుడు, తోటలో మిత్రులతో కలిసి మామిడిపండ్లను తింటున్న చిన్నకృష్ణుడు.. పుష్పాలతో తయారు చేసిన ఏనుగులు, నవధాన్యాలతో రూపొందించిన శ్రీమహావిష్ణువు ప్రతిమలు ప్రత్యేకంగా నిలిచాయి. ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వంద మంది కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వంద మంది రెండురోజుల పాటు శ్రమించారు. తిరుమల మొత్తం పండుగ సందడి కనిపించింది. ఆలయం ముందు పలువురు భక్తులు ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

రుయాలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా

- రుయాస్పత్రిలో నెల రోజులుగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన జోరుగా సాగుతోంది. ఇప్పటికే 20కి పైగా నకిలీ సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. వీటి జారీ వెనుక కొందరు కింది స్థాయి సిబ్బంది పాత్ర ఉన్నట్లు కూడా తేలింది. లోలోపలే దానిపై విచారణ చేపడుతున్నారు.
- తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేసే ఓ శానిటరీ మేస్త్రి.. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు గతేడాది నవంబరు 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు మూడు నెలలు సెలవు కావాలని మెడికల్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ తర్వాతా ఆరోగ్యం కుదుటపడలేదని సెలవును మరో 54 రోజులు పొడిగించాలంటూ ఫిబ్రవరి 1 నుంచి మార్చి 24 వరకు మళ్లీ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చారు. తన ఆరోగ్యం కుదుటపడిందంటూ ఈనెల 25న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించారు. వీటన్నింటిని రుయాస్పత్రిలోని ఒకే డాక్టరు మంజూరు చేశారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులకు అనుమానం వచ్చి రుయా అధికారులను విచారించగా.. ఈ మెడికల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసిన సదరు డాక్టరు పదేళ్ల కిందట రుయాస్పత్రిలో పనిచేసి అప్పుడే రిటైర్ అయినట్లు తెలిసింది.
- ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న రేణిగుంటవాసి రెండు నెలలు సెలవు కోసం నెల కిందట మెడికల్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ కంపెనీ ప్రతినిధులు అనుమానంతో పరిశీలించగా అది రుయాస్పత్రిలో ఏడేళ్ల కిందట రిటైరైన జనరల్ సర్జరీ విభాగాధిపతి ఇచ్చినట్లుగా తేలింది. ఆ విషయాన్ని రుయా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యల్లేవు.

రుయాలో ఏం జరుగుతోంది?

రుయాలో ఎంఆర్‌డీ (మెడికల్ రికార్డు డిపార్టుమెంటు)లో కొందరు సిబ్బంది గతంలో ఆస్పత్రిలో పనిచేసి బదిలీ అయిన, రిటైరైన అధికారుల పేర్లతో సంతకాలు చేసి వారి హోదాతో నకిలీ సీలు వేసి ఇలా సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికోసం బయట ఓ గదిని సిద్ధం చేసుకొన్నట్లు విమర్శలున్నాయి. కొందరు మధ్యవర్తుల ద్వారా నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు అవసరాన్ని బట్టి వసూలు చేస్తున్నారని తెలిసింది. అయితే, సర్టిఫికెట్లు అవసరమైన వారు మధ్యవర్తుల మాటలు నమ్మి నకిలీ వాటినే నిజమైనవిగా భావించి తీసుకెళుతున్నారు. వీటివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యార్థులకు అనేక అనర్థాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు నకిలీ సర్టిఫికెట్ల ముఠా ఆటకట్టించాల్సి ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



ఎస్వీయూ సమీపంలోని ఈద్గా మైదానం

- సిద్ధమైన ఈద్గా మైదానాలు

తిరుపతి(కల్చరల్),మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. రంజాన్ ప్రార్థనలకు జిల్లాలోని ఈద్గా మైదానాలు సిద్ధమయ్యాయి. ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ఉదయం 9.30 గంటలకు రంజాన్ ప్రార్థనలు నిర్వహించనున్నారు. వేలాదిగా తరలివచ్చే ముస్లింల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బియ్యం కార్డుదారులకు ఊరట

- ఏప్రిల్ నెలాఖరు వరకు ఈకేవైసీ గడువు పెంపు

తిరుపతి(నేరవిభాగం) మార్చి 30(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ఈకేవైసీకి ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. జిల్లాలో మొత్తం రేషన్ కార్డుదారుల్లోని సభ్యులు 16.30 లక్షల మంది. వీరిలో ఈ నెల 29 వరకు దాదాపు 14.74 లక్షల మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారు. ఇంకా 1.56 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాలి. ఇందులో ఐదేళ్ళ పైబడి వున్న పిల్లలు 20,100 మంది ఉన్నారు. వీరంతా ఏప్రిల్ నెలాఖరు లోగా ఈకేవైసీ చేసుకోవాలి. లేదంటే రేషన్ కట్ చేస్తారు. ఎండీయూ ఆపరేటర్ల వద్ద కూడా కార్డుదారులు ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉంది. రేషన్ దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్లు, వార్డు సచివాలయాల వద్ద ఉన్న జాబితా ఆధారంగానే ఈకేవైసీ చేయించుకోవాలి. గతంలో చేసుకున్న వారికి, ఐదేళ్ల లోపు చిన్న పిల్లలు చేయించుకోవాల్సిన పనిలేదు. గతంలో చేసుకున్నామో లేదో అని రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవాళ్లందరూ వెళ్లి బారులు తీరడంతో సమయం వృథా అవుతోంది. అందుకని ఆయా జాబితాల్లో పేర్లు చూసుకుని.. ఈకేవైసీ చేసుకోవాల్సిన వాళ్లే వెళ్లాలి. 'ఈకేవైసీ లేని సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలి' అని డీఎస్‌వో శేషాచలం రాజు తెలిపారు.

వంతెనలకు మరమ్మతులు చేయండి



కర్లపూడి వద్ద దెబ్బతిన్న వంతెన

కోట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చల్లకాలువపై నిర్మించిన వంతెనలు మరమ్మతులకు గురయ్యాయి. కోట మండలం తిన్నెలపూడి వద్ద ఉన్న స్వర్ణముఖినది నుంచి చల్లకాలువ 32 కిలోమీటర్లు వెళ్లి గోవిందపల్లి పాళెం వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ కాలువపై నెల్లూరుపల్లికొత్తపాళెం, కర్లపూడి, సిద్ధవరం గ్రామాల మధ్య వంతెనలు నిర్మించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెనలపై వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతుండడంతో పలుచోట్ల దెబ్బతిన్నాయి. సిద్ధవరం వంతెనపై చిల్లకూరు, కోట మండలాల్లోని 16 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా కృష్ణపట్నం పోర్టు మొదలుకొని పలు పరిశ్రమలకు సంబంధించిన వాహనాలు ఈ వంతెనపై నుంచి ప్రయాణాలు సాగిస్తుంటాయి. అదే విధంగా కర్లపూడి వంతెనపై చిల్లకూరు మండలంలోని సుమారు 8 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనలు పలుచోట్ల దెబ్బతినడంతో వాహనాల ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన వసతులు



వాలీబాల్‌కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టు, క్రీడాకారుల సౌకర్యార్థం ఆధునీకరించిన వసతిగదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు ప్రతిరోజు స్టేడియంలో వాకింగ్ చేయడంతో పాటు క్రీడాకారులు పలు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారన్నారు. క్రీడాకారుల సౌకర్యార్థం నూతనంగా వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయడంతో పాటు స్టేడియంలోని జిమ్‌ను ఆధునికీకరించి అందుబాటులోకి తెచ్చామన్నారు. అదేవిధంగా మహిళల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని, ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏరియా ఆస్పత్రి నుంచి డ్రైనేజీ నీరు స్టేడియంలోకి రాకుండా చర్యలు చేపట్టేందుకు రూ.15లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐలు కిషోర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, వేగూరు రాజేంద్రప్రసాద్, నిమ్మకాయల రవి, తూపిలి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శర్మ, రవీంద్ర, మస్తాన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో లక్షకుంకుమార్చన



లక్షకుంకుమార్చనలో ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు, పక్కన దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గోపూజ అనంతరం కలశ ప్రతిష్ట చేశారు. అనంతరం అమ్మవారి ఆస్థాన మండపంలో లక్షకుంకుమార్చన నిర్వహించారు. ముందుగా సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఎమ్మెల్యే దంపతులు లక్షకుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. ఉగాది పర్వదినం ఉభయకర్తలుగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, గీతాలత, అన్నదానం ఉయకర్తలుగా టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు, పుష్పాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఆర్ 9000 షోరూం యజమానులు, చందనాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఎంవీఐ చెన్నూరి రాంబాబు, సత్యకుమారి దంపతులు, లక్షకుంకుమార్చన పూజ ద్రవ్యాల విరాళదాతలుగా చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు.

ట్రాఫిక్ నింబంధనలు పాటించండి



బ్యారికేడ్‌లను ప్రారంభిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 39 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపే సమయంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలో విశ్వసాయి బిల్డర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బ్యారికేడ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అతివేగంగా, మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, బాలకృష్ణంరాజు, దశరథరామిరెడ్డి, సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

చిల్లకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కృష్ణపట్నం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ తోడ్పాటు అందించనుందని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మండలంలోని గుమ్మళ్లదిబ్బకొత్తూరులో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు వేరుశెనగ నూనె ఉత్పత్తి, పలు రకాల తినుబండారాల తయారీలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వసంతోత్సవాలు



వైకుంఠవాసుడి అవతారంలో బాలాంజనేయస్వామి

సూళ్లూరుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తొలిరోజు స్వామివారు వైకుంఠవాసుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అభిషేకనంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. అదే విధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాముల దేవస్థానంలో వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

లోలెవల్ కాజ్‌వే నిర్మాణానికి మోక్షం లేదా?

అరవై ఏళ్లుగా ప్రజల ఇబ్బందులు



చెక్‌డ్యామ్ వద్ద చప్టా రహదారిపై ప్రవహిస్తున్న నీరు

పెళ్లకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు వద్ద స్వర్ణముఖినదిపై 1964లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చెక్‌డ్యామ్ నిర్మించారు. దీని వల్ల రెండు పంట కాలువలు పుట్టుకొచ్చి వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే చెక్‌డ్యామ్‌కు దిగువ భాగాన శ్రీకాళహస్తి నుంచి పెళ్లకూరు, నాయుడుపేట, తొట్టంబేడు, బాలయపల్లి, ఓజిలి, వెంకటగిరి మండలాలను కలిపే రహదారి ఏర్పడింది. అయితే చెక్‌డ్యామ్ నుంచి పొంగిపొర్లే వరద ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు జిల్లాల మధ్య ఈ చెక్‌డ్యామ్ ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన జరిగాక సూళ్లూరుపేట పరిధిలో చేరినా భౌగోళికంగా శ్రీకాళహస్తికి సమీపంలో ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన నేతలు వారికి అవసరమైన చోట స్వర్ణముఖినదిపై వారధిని నిర్మించారు. అయితే సూళ్లూరుపేట నేతలకు జనం పడుతున్న పాట్లు కానరావడం లేదు. పెళ్లకూరు, నాయుడుపేట, తొట్టంబేడు, బాలయపల్లి, ఓజిలి, వెంకటగిరి మండలాల ప్రజలు శ్రీకాళహస్తికి వెళ్లడానికి కలవకూరు చెక్‌డ్యామ్ కింద ఉన్న దారే దగ్గర. అయితే చెక్‌డ్యామ్ నుంచి పారే నీటి కారణంగా దారంతా పాచి ఏర్పడి రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారింది. పాచి మీద నడిచి వెళ్లే సమయంలో జారిపడి జనం ప్రమాదాలకు గురవుతున్నారు. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిపేయాల్సి వస్తోంది. స్వర్ణముఖినదిపై లోలెవల్ కాజ్‌వే నిర్మించండి మహాప్రభో అని అరవై ఏళ్లుగా ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునేవారే లేరు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కొణతనేరి నుంచి కోనేటిరాజుపాలెం వరకు 19 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మించింది. అయితే చెక్‌డ్యామ్ వద్ద కాజ్‌వే లేని కారణంగా జనానికి కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కలవకూరు వద్ద స్వర్ణముఖినదిపై లోలెవల్ కాజ్‌వే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



గూడూరు: వెండిచీరలో రాజరాజేశ్వరిదేవి, శాకాంబరిదేవిగా మహాలక్ష్మమ్మ - చిల్లకూరు: బంగారుచీరలో ముత్యాలమ్మ - కోట: మల్లెపూల అలంకారంలో కోటమ్మ - వాకాడు: విశేష అలంకరణలో పట్టాభిరాముడు

సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

గూడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను ఆదివారం ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని వెండిచీరతో అలంకరించారు. రెండో పట్టణ పరిధిలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అమ్మవారినిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. స్థానిక గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం జరిపారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి పూజలు నిర్వహించి, నవావరణ హోమం చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పంచాగ శ్రవణం చేశారు. పోలేరమ్మ రచ్చల వద్ద పూజలు నిర్వహించి భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

చిల్లకూరు: ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఆదివారం తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక దేశమ్మ, గంగమ్మ, సుందరమ్మ, మాతమ్మ అమ్మవార్ల ఆలయాల్లోని ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: స్థానిక గ్రామదేవత కోటమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. అదేవిధంగా వీరాంజనేయ ఆలయంలో టీడీపీ నాయకులు తూపిలి రాధాకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయం, తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయం, జనార్దనస్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి.

వాకాడు: మండలంలోని పట్టాభిరామాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దివి అనంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అమరేంద్రరెడ్డి, మాలిని దంపతులు ఆలయ అలంకరణకు ఉభయదాతలుగా వ్యవహరించారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, కోగిలి వడ్డికండ్రిగ, తాడిమేడు, ఆరూరు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి.

వెంకటగిరి: గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

చిరంజీవి సేవాసంఘం చేయూత

తడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిలింగాలపాడు గ్రామానికి చెందిన నూలేటి వెంకటేష్‌కు చిరంజీవి సేవాసంఘం ఆర్థిక చేయూత అందించింది. కొంత కాలంగా వెంకటేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిరంజీవి సేవాసంఘం సభ్యులు మాబాషా, హరిబాబు, కోటి, తేజ ఆదివారం వెంకటేష్‌ను కలిసి రూ.15వేలు అందజేశారు.

సీపీఎం ప్రజా చైతన్యయాత్ర

నాయుడుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు ఆదివారం నాయుడుపేటలోని జువ్వలపాళెం చెరువుగట్టు కాలనీని పరిశీలించారు. గిరిజనులు, దళితులు ఉన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేనట్లు గుర్తించారు. జువ్వలపాళెం చెరువుగట్టు కాలనీవాసులకు పక్కాగృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివకవి ముకుంద, వీరయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

కలప లారీ స్వాధీనం



అటవీశాఖ కార్యాలయం వద్ద కలప లారీ

సూళ్లూరుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కలప తరలిస్తున్న లారీని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా పులికాట్ గ్రామీణ ప్రాంతం నుంచి కర్రతుమ్మ కట్టెలను తరలిస్తున్న లారీని జాతీయ రహదారిపై హోలిక్రాస్ కూడలి సమీపంలో డీఎఫ్‌వో హారికి తన సిబ్బందితో కలిసి పట్టుకొన్నారు. స్వాధీనం చేసుకున్న లారీని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

అధ్యాపకుడు పీర్‌కుమార్‌కు నంది అవార్డు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బీ.పీర్ కుమార్‌కు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ నంది అవార్డు అందజేసింది. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియంలోని భాస్కర్ ఆడిటోరియంలో రెండురోజుల క్రితం జరిగిన జాతీయ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఫౌండేషన్ ఎండీ శిరీషరెడ్డి చేతుల మీదుగా బంగారు నంది అవార్డును పీర్‌కుమార్ అందుకున్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్న ఆయన గూడూరు కళాశాలలో పనిచేస్తూనే పాటలు, నాటికలు రచించడం, చిన్న పాత్రల ద్వారా నటనలో ప్రతిభ కనబరుస్తుండడంతో ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేశామని మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న పీర్‌కుమార్

నెలవలకు సత్కారం



నెలవల దంపతులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులను టీడీపీ నాయకులు సత్కరించారు. ఆదివారం నాయుడుపేటలో నెలవలను కలిసిన నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నెలవలతో పాటు ఆయన సతీమణి అమృతసరళను సత్కరించారు. కార్యక్రమంలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్యానాయుడు, కృష్ణమనాయుడు, మురళీ నాయుడు, నరేంద్ర యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీ ఛేదించాలి



ర్యాలీ చేస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి మిస్టరీ ఛేదించాలని పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కోట పట్టణంలో కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రవీణ్ మృతిపై మిస్టరీని తేల్చకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ నాయకులు నోవాబాబు, దినకర్ బాబు, జోసెఫ్, రంగనాథ్, మీజూరు మాధవ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. కుర్రకాలువకు చెందిన ఓబుల్ రెడ్డి మనవడు గోవర్ధన రెడ్డి(20) సాయినగర్‌లో నివాసముంటున్నాడు. స్నేహితుడు హేమంత్‌రెడ్డితో కలిసి చెడు తిరుగుళ్లు తిరుగుతూ తాగుడు, ధూమపానానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం డబ్బు కోసం హేమంత్‌రెడ్డి ఇంటికి వెళుతున్నట్లు నానమ్మ, తాతయ్యకు చెప్పి వెళ్లాడు. అదేరోజు రాత్రి హేమంత్‌రెడ్డి ఇంట్లో కరెంటు షాక్ కారణంగా గోవర్ధనరెడ్డి మృతిచెందినట్లు ఓబుల్‌రెడ్డికి ఫోన్ వచ్చింది. మృతదేహాన్ని పరిశీలించగా కుడికాలు బొటన వేలికి గాయమై ఉంది. హేమంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానం చెబుతుండడంతో రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గోవర్ధనరెడ్డి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. గోవర్ధనరెడ్డి, హేమంత్‌రెడ్డి మధ్య అప్పు విషయంలో తగాదాలు ఉండేవని ఓబుల్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న తమిళనాడు బస్సు

● ఐదుగురికి స్వల్పగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

తడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు దిగడానికి ఆగిన ఆర్టీసీ బస్సును తమిళనాడు బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా కనిగిరి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి 9 గంటల సమయంలో చెన్నైకు బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున తడకు చేరుకుంది. ప్రయాణికులు దిగుతున్న సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కనిగిరి డిపో బస్సును ఢీకొంది. దీంతో కనిగిరి ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లి డివైడర్ రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంతో రెండు బస్సులు దెబ్బతినగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనిగిరి డిపో బస్సు డ్రైవర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మకు వెండి చీర బహూకరణ



వెండి చీర అందజేస్తున్న చక్రిధర్‌రెడ్డి దంపతులు



వెండి చీరలో పోలేరమ్మ

నాయుడుపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు రూ.3 లక్షలు విలువచేసే వెండి చీరను పట్టణానికి చెందిన బుర్ల చక్రిధర్‌రెడి, శశికళ దంపతులు బహూకరించారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చిన చక్రిధర్‌రెడి, శశికళ దంపతులు పెదకాపు శ్రీనివాసులురెడ్డికి వెండిచీరను అందజేశారు. వెండిచీరను అలంకరించిన అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని అంకమ్మ, మానసాదేవి, దుర్గాదేవి ఆలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాలలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, నానాబాల సుబ్బారావు, మణి, గోపి, రామారావు, శ్రీనివాసులు, నారాయణ, రవి, సిద్ధయ్య, చిరువెళ్ల మునిరాజ, రాజు, తదితరులు పాల్గొన్నారు.